క్లుప్తంగా

వైభవంగా పోలేరమ్మ తీర్థం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

తాళ్లరేవు: పోలేకుర్రు గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా నర్సింగ్ ప్రవేశ పరీక్ష



నర్సింగ్ కోర్సుల ఎంట్రన్స్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

యానాం: పట్టణంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ నిర్వహించిన నర్సింగ్ కోర్సుల ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గ పరిధిలో మొత్తంగా 61 మంది దరఖాస్తు చేసుకోగా 49 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని, మరో 12 మంది గైర్హాజరయ్యారని ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. స్థానిక రాజీవ్‌గాంధీ ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని ఆర్ఏఓ మునిస్వామి, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు తదితర అధికారులు తనిఖీ చేశారు.

పునాదుల్లోనే సంపద సృష్టి



సన్నవిల్లిలో పునాదుల దశలోనే నిలిచిపోయిన సంపద సృష్టి కేంద్రం

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామంలో నిర్మిస్తున్న చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం నిర్మాణం పునాదుల్లోనే నిలిచిపోయింది. చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకంపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించి ఎక్కడ పనులను అక్కడే వదిలేశారు. దీని కారణంగా గ్రామంలో చెత్తను రోడ్ల వెంబడి పాడేస్తుండడంతో రోగాలు విజృంభిస్తున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే అశోక్ చేయూత



వృద్ధుడికి వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: వినికిడి సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తన సొంత ఖర్చులతో వైద్య పరీక్షలు చేయించడంతో పాటు వినికిడి యంత్రాన్ని సైతం సమకూర్చారు. స్థానిక కురసాంపేటకు చెందిన కె.సత్యనారాయణ అనే వృద్ధుడు తాను వినికిడి సమస్యతో బాధపడుతున్నానని, దీనివల్ల ఒక్కోసారి ప్రమాదాలకు సైతం గురవుతున్నానని సాయం చేయాలంటూ ఎమ్మెల్యే అశోక్‌ను కోరారు. స్పందించిన ఆయన స్థానిక సూర్య పోలీ క్లినిక్‌లో ఆడియాలిస్టు డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో వృద్ధుడికి వైద్య పరీక్షలు చేయించి వినికిడి యంత్రాన్ని బాధితుడికి అందజేశారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సారెను తీసుకొచ్చిన సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు పంచాయతీ పరిధిలోని పితానివారిపాలెంలో వైష్ణవి కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢం సందర్భంగా మహిళలు ఆదివారం సారె సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ వాకాడ శ్రీను, నగర కన్వీనర్ అర్లపల్లి ముత్యాలరావు, జిల్లా మహిళా కన్వీనర్ యనమదల లక్ష్మి, మండల కన్వీనర్ మట్టా నాగేశ్వరరావు, ధర్మ ప్రచారక్ మేడిశెట్టి నాగభూషణం, మహిళలు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో అందించారు.

రాత్రి పదికే దుకాణాల మూసివేత

- పోలీసుల ఆంక్షలతో హోటళ్ల యజమానులు, చిరు వ్యాపారుల ఆవేదన
- శాంతి భద్రతల పరిరక్షణకే నిబంధనలంటున్న పోలీసులు



అమలాపురంలో రహదారి పక్కన పండ్ల దుకాణాలు



అమలాపురంలో తోపుడు బండ్లపై పండ్లు అమ్ముకుంటున్న చిరు వ్యాపారులు

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దుకాణాలన్నీ రాత్రి 10 గంటలకే మూసివేయాలన్న పోలీసుల ఆంక్షలతో వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతి భద్రతల కోసమే ఆ సమయానికి దుకాణాలు మూయించి వేస్తున్నామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. గతంలో అమలాపురం పట్టణంలో రాత్రి పది గంటల దాటిన తర్వాత కూడా వ్యాపారాలు నిర్వహించుకునేవారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలీసుల ఆంక్షలు తెర మీదకు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అమలాపురం పట్టణంతో పాటు జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకుంది. ఎన్నికల ఫలితాలు వెలువడి నెల గడుస్తున్నా చిరు వ్యాపారులపై ఆంక్షలు కొనసాగుతుండడంతో వారు చాంబర్ ఆఫ్ కామర్స్‌లను ఆశ్రయించారు.

వెసులుబాటు కోరుతున్న వ్యాపారులు

రాత్రి పది గంటల సమయంలోనే తమకు బేరాలు అధికంగా ఉంటాయని, వినియోగదారులు ఇళ్లకు వెళుతూ పలు వస్తువులు, ఫుడ్ పార్శిళ్లు తీసుకు వెళుతుంటారని హోటళ్లు, చిరు వ్యాపారాలు చేసే దుకాణదారులు చెబుతున్నారు. అలాగే రాత్రి పది గంటలకు దుకాణం కట్టేయాలంటే కనీసం గంట సమయం ముందు నుంచే పని మొదలుపెట్టాల్సి వస్తుందని హోటళ్ల యాజమానులు చెబుతున్నారు. హోటళ్లలో టేబుళ్ల వద్ద కూర్చున్న కస్టమర్లను సరిగ్గా రాత్రి పది గంటలకు లేచి పొమ్మని చెప్పలేమంటున్నారు. ఈ సమస్యలన్నింటినీ ఇటీవల చాంబర్ ఆఫ్ కామర్స్‌లకు చెందిన వ్యాపార సంఘాల ప్రతినిధుల బృందం పట్టణ సీఐని కలిసి వినతి పత్రం కూడా అందించారు. అయినా పోలీసు అధికారులు శాంతి భద్రతల దృష్ట్యా ససేమిరా అంటున్నారు. రాత్రి పది గంటలైతే చాలు పోలీసులు సైరన్లు మోగిస్తూ వరస పెట్టి దుకాణాలను ముఖ్యంగా హోటళ్లను మూసివేయిస్తున్నారు. పోలీసులు వస్తున్నప్పుడు వ్యాపారులు బెంబేలు పడిపోతూ ఆదరాబాదరాగా దుకాణాలను మూసివేయక తప్పడం లేదు. ఆ సమయంలో వ్యాపారులపై పోలీసులు దురుసుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టణం, రూరల్ మండలంలోని కొన్ని గ్రామాల్లో చిరు వ్యాపారులు 110 మంది వరకూ ఉన్నారు. పెద్ద, చిన్న హోటళ్లు సుమారు 70 వరకూ ఉన్నాయి. ఈ వ్యాపారులే కనీసం మాకు రాత్రి 11 గంటల వరకూ దుకాణాలు తెరుచుకునే వెసులుబాటు ఇవ్వాలని పోలీసులను వేడుకుంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం



శాంతి భద్రతల దృష్ట్యా పట్టణ, పరిసర గ్రామాల్లో దుకాణాలన్నీ రాత్రి 10 గంటలకే మూసి వేయాలి. ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదు. ఈ ఆంక్షలను వ్యాపారులందరూ అనుసరించాల్సిందే. వ్యాపారుల వినతిని మా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. అప్పటివరకూ దుకాణాలన్నీ రాత్రి పది గంటలకే మూసి వేయాల్సిందే.

– కె.క్రిస్టోఫర్, పట్టణ సీఐ, అమలాపురం

మానవతా దృక్పథంతో వెసులుబాటు ఇవ్వాలి



పట్టణంలో రోడ్ల చెంత తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు చేసే వ్యాపారులు, చిన్న చిన్న హోటళ్ల విషయంలో పోలీసులు మానవతా దృక్పథంతో వెసులుబాటు ఇవ్వాలి. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటామంటూ వ్యాపారుల నుంచి లిఖిత పూర్వక హామీ తీసుకుని ఆంక్షలను ఎత్తివేయాలి. కనీసం రాత్రి 11 గంటల వరకూ వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలి.

– యల్లమిల్లి నాగ సుధా కొండ, వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆజాద్ ఫౌండేషన్, అమలాపురం

వైభవంగా ఆషాఢ మాస జాతర



సుబ్బాలమ్మ గరగకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, ఆటో కార్మికులు

అమలాపురం టౌన్: స్థానిక హైస్కూలు సెంటరులోని విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణ దేవత సుబ్బాలమ్మకు ఆషాఢ మాస జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సుబ్బాలమ్మ గరగకు జరిగిన పూజా కార్యక్రమానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఆంధ్ర ఆటోవాలా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మోటారు వాహనాల గ్రామ దేవతగా కొలువైన సుబ్బాలమ్మకు ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో ఏటా అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని జిల్లా యూనియన్ అధ్యక్షుడు సత్తిరాజు తెలిపారు. హైస్కూలు సెంటర్ ఆటో యూనిట్ అధ్యక్షుడు రాయుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆషాఢ జాతర మహోత్సవ ఊరేగింపు నిర్వహించారు. ఆషాఢ మాసం నాలుగు వారాలూ పట్టణంలోని అన్ని ఆటో యూనియన్లచే జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, వాసర్ల వెంకన్న, సుబ్బారావు తదితరులు సుబ్బాలమ్మ గరగను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కోతకు గురవుతున్న లంక భూములు



కనకాలపేట వద్ద కోతకు గురవుతున్న లంక భూములు

యానాం: నియోజకవర్గ పరిధిలో గౌతమీ గోదావరి తీర ప్రాంతంలో ఉండే లంక భూములు తరచూ వస్తున్న వరదలకు కోతకు గురవుతున్నాయని స్థానిక కనకాలపేట రైతులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. వందల ఎకరాల మేర భూమి గోదావరి నదీ గర్భంలో కలిసిపోతున్న నేపథ్యంలో సమస్యపై చర్చించేందుకు రైతులంతా కనకాలపేటలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఇప్పటికే లక్షలాది రూపాయల విలువజేసే వందలాది ఎకరాల్లో భూమితో పాటు కొబ్బరిచెట్లు సైతం గోదావరిలో నేలకొరిగాయన్నారు. వరద నీరు ప్రవహించే రక్షణ గట్టు వెంబడి బాలయోగి వారధి వరకూ రివిట్‌మెంట్ నిర్మిస్తేనే సమస్య పరిష్కారమవుతుందంటున్నారు. అరటికాయలంక నుంచి బాలయోగి వారధి వరకూ సుమారు 5 కిలోమీటర్ల మేర రివిట్‌మెంట్ నిర్మించాల్సి ఉందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో స్థానిక రైతులు కోన రామారావు, కోన సూరిబాబు, చలపతి, చినసత్తియ్య, మాగాపు సుబ్బారావు, కవల బాబులు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఏటిగట్టు రహదారి



గోవలంక వద్ద కుంగిపోయి ప్రమాదకరంగా మారిన ఏటిగట్టు రహదారి

తాళ్లరేవు: వృద్ధ గౌతమి గోదావరి ఏటిగట్టు రహదారి పలుచోట్ల ప్రమాదకరంగా మారింది. ఇటు యానాం నుంచి అటు రావులపాలెం వరకూ నిత్యం ఈ రహదారిపై అనేక వాహనాలు సంచరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా ఇసుక లోడుతో వెళ్లే భారీ వాహనాల కారణంగా ఈ రహదారి పలుచోట్ల దిగబడిపోయింది. గోవలంక వద్ద గల మలుపులోనైతే రహదారి ఒకవైపు బాగా కుంగిపోయింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణమంటే ప్రాణాలతో చెలగాటమేనంటూ వాహనదారులు వాపోతున్నారు. గోదావరి చెంతన గల గ్రామాల ప్రజలంతా ఈ రహదారిలో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందనని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఏటిగట్టు రహదారికి భద్రత కల్పించాలని కోరుతున్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి



హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న బీజేపీ యువ మోర్చా బృందం

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు పరిధి బీవీ రమణయ్య కాలనీలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్– 2 వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ యువమోర్చా సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం వసతి గృహాన్ని సందర్శించిన వారు విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ వార్డెన్ అందుబాటులో ఉండకుండా విధులకు గైర్హాజరవుతున్నారన్నారు. హాస్టల్లో విద్యార్థులకు సరైన సదుపాయాలు కల్పించడం లేదన్నారు. అల్పాహారం, భోజనాల్లో నాణ్యత పాటించడం లేదని గుర్తించామన్నారు. అందుకే హాస్టల్ వార్డెన్ సస్పెండ్‌కు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న అధ్యాపకుల బృందం

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంక పంచాయతీ పరిధిలో తోట్లపాలెం గ్రామానికి చెందిన ఆకుమర్తి నాగేంద్రకుమార్, శాంతకుమారిల రెండో కుమార్తె జ్యోతి అరుదైన వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది రూ.11,140 ఆర్థిక సాయాన్ని విద్యార్థిని కుటుంబసభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్‌కుమార్, కె.దుర్గాప్రసాద్, డి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ సమావేశంలో తీర్మానాల ఆమోదం

యానాం: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో సుకన్య కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగింది. సమావేశంలో బీజేపీ ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ సురేనా, బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, హోంమంత్రి నమశ్శివాయం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. ముఖ్యంగా నరేంద్రమోడీని మూడోసారి ప్రధానిగా చేసినందుకు ప్రజలు, జాతీయ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రిచర్డ్, అశోక్ బాబు, జానస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద డోలిక..



కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన 1976 –77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు మంగళంపల్లి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన పాఠశాలలో కార్యక్రమం జరిగింది. జీవితంలో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా సుమారు 48 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా అప్పటి గురువర్యులు కోరుమిల్లి సత్యనారాయణాచార్యులు, ఆకుల వీరాంజనేయులు, అప్పటి అటెండర్ కడలి రామ్మూర్తిలను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆదుర్తి వెంకటగణేష్, అడబాల కృష్ణప్రసాద్, కుక్కల సత్యనారాయణమూర్తి, మంగళంపల్లి శ్రీనివాసరావు, కాట్రు చిట్టిబాబు, బయ్యి సుజాత, మెట్ల సుబ్బలక్ష్మి, యాళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై ఇరువర్గాల వాగ్వాదం

యానాం: నియోజకవర్గ శివారు సావిత్రి నగర్‌లో ఓ ఇంటి స్థలం విషయంలో ఆదివారం ఇరువర్గాల మధ్య వివాదం కాస్తా ఘర్షణకు దారి తీసింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి గొడవను సద్దుమణిగించారు. ఘటనకు సంబంధించి ప్రభుత్వం తమకు ఇచ్చిన నివేశనా స్థలం ఆక్రమిస్తున్నారని, రక్షణ కల్పించాలని పాలెపు వీర్రాజు అనే వ్యక్తి యానాం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. తన భార్య పాలెపు గంగాయమ్మ పేరు మీద గతంలో యానాం డిప్యూటీ కలెక్టర్ ఇళ్ల పట్టా మంజూరు చేశారన్నారు. అక్కడే చిన్న ఇంటిని నిర్మించుకుని కుటుంబంతో జీవిస్తున్నామన్నారు. తమ ఇంటికి తూర్పు వైపున వలలు తదితర వేట సామగ్రి పెట్టుకోవడానికి కొంత స్థలం వదిలి పెట్టామన్నారు. ఇప్పుడు ఆ స్థలంలో చొరబడేందుకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, తమ స్థలం ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని పాలెపు వీర్రాజు తన ఫిర్యాదులో కోరారు.

చేపల మార్కెట్ తరలించాలి



చేపల మార్కెట్ వల్ల రద్దీగా మారిన బైపాస్ రోడ్డు

అమలాపురం టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో నల్ల వంతెన దిగువన అనధికార చేపల మార్కెట్‌తో ఇబ్బందులకు గురవుతున్నామని, దాన్ని అక్కడి నుంచి తరలించాలని పట్టణవాసులు మున్సిపాలిటీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో చేపల మార్కెట్ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని వాహనదారులు వాపోతున్నారు. పైగా సమీపంలో ఉన్న నివాసితులు సైతం చేపల మార్కెట్ నుంచి వచ్చే వాసనతో నిత్యం సతమతమవుతున్నామంటున్నారు. ఎనిమిదేళ్ల క్రితం నాలుగైదు చేపల దుకాణాలతో మొదలై ఇప్పుడు చేపల మార్కెట్‌గా మారింది. చేపల వ్యర్థాలను వెనకే ఉన్న కాలువలో పాడేస్తుండడం వల్ల ప్రజలకు దాహార్తిని తీర్చే నీరు కలుషితమవుతోందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చేపల మార్కెట్‌ను ఇక్కడి నుంచి తరలించాలని పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

ఘనంగా ఫ్రెంచ్ నేషనల్ డే



వార్ మెమోరియల్ వద్ద నివాళులర్పిస్తున్న ఫ్రెంచి పౌరులు, అధికారులు

యానాం: ఫ్రెంచి జాతీయ దినోత్సవమైన బాస్టిల్ డేను పుదుచ్చేరిలోని ఫ్రెంచ్ వార్ మెమోరియల్ స్థలం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు యానాంలో ఫ్రెంచి పౌరుల ప్రతినిధి సాధనాల బాబు నేతృత్వంలో పలువురు ఫ్రెంచి పౌరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న సైనికులకు నివాళులర్పించారు. సైనికుల త్యాగాలకు గుర్తుగా ఫ్రెంచి అధికారులు వార్ మెమోరియల్ వద్ద పూలను ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ 1789, జులై 14న ఫ్రెంచి విప్లవం, బాస్టిల్ కోటపై మెరుపుదాడి చేసి రాచరిక ప్రభుత్వానికి చరమగీతం పాడినందుకు గుర్తుగా ఈ వేడుకలు నిర్వహిస్తారన్నారు. ఫ్రెంచి సంస్కృతి వేడుకే కాదని ప్రజాస్వామ్యం, మానవహక్కుల విలువలను తెలియజేస్తుందని పేర్కొన్నారు. పుదుచ్చేరి ఫ్రెంచి కాన్సుల్ జనరల్ లైజ్ టాల్బెట్ బారిలెడ్, పుదుచ్చేరి కలెక్టర్ కులుంగొత్తన్, ఫ్రెంచి హయాంలో అధికారులుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందినవారు వేడుకల్లో పాల్గొన్నారు.

విలసవిల్లిలో ప్రత్యేక పూజలు



విలసవిల్లిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో శ్రీరామ మందిరంలో నిర్వహిస్తున్న వారాహి అమ్మవారి నవరాత్ర ఉత్సవాల్లో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్‌కు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించి వారాహి అమ్మవారి విశిష్టతను వివరించి వేదాశీర్వచనం అందజేశారు. పండితులు మున్నంగి రామకృష్ణ శర్మ, శ్రీవారాహి మాత నవరాత్రులు గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి–216లోని కోరంగి వంతెనపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామన్నపాలెం గ్రామానికి చెందిన పాలెపు ప్రసాద్ కోరంగి నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ప్రసాద్‌ను స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు సైతం స్వల్ప గాయాలయ్యాయి. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వేణుగోపాలరావు

అమలాపురం రూరల్: అమలాపురం లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా రవణం వేణుగోపాలరావు నియమితులయ్యారు. క్లబ్ కార్యదర్శిగా డాక్టర్ మద్దెల వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా వెంకటపతిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సాయంత్రం స్థానిక లయన్స్ క్లబ్ హాలులో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధా కొండ ఆదివారం సత్కరించారు.

శాకంబరీ దేవిగా సత్తెమ్మ తల్లి



శాకంబరి అలంకరణలో సత్తెమ్మ తల్లి

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లిలో కొలువైన సత్తెమ్మ తల్లి ఆదివారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం రెండో ఆదివారం సందర్భంగా అమ్మవారిని గుమ్మల రాము సమకూర్చిన పండ్లు, కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

నిందితులను శిక్షించాలని డిమాండ్

అమలాపురం టౌన్: కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాతనపల్లిలో చెలరేగిన భూ వివాదంలో దళిత మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేసిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.